క్లుప్తంగా

యోగా తరగతులు



మనుబోలు: యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ట్రైయినర్ చెలికం కోటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మనుబోలు జెడ్పీ హైస్కూల్లో మాట్లాడారు. పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు తరగతులను నిర్వహిస్తామని వెల్లడించారు.

మడమనూరులో ఉచిత వైద్య శిబిరం



మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామంలో పముజుల రామశేషయ్య వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలకు చెందిన డాక్టర్ ఎంపీ రమణయ్య మాట్లాడారు. శిబిరంలో సుశీల నేత్రాలయ వైద్యులు పి.సుధాకర్‌రావు, మన్నె సతీష్, చెన్నైకి చెందిన డాక్టర్ చారిక తదితరులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

గుండెపోటుతో సీపీఎం నేత మృతి



శామ్యూల్ (ఫైల్)

కొడవలూరు: సీపీఎం నేత బట్టేపాటి శామ్యూల్ (68) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. నార్తురాజుపాళెంలోని నివాసంలో ఆయన భౌతికకాయానికి పలువురు నేతలు నివాళులర్పించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, సీపీఎం జిల్లా నేతలు మోహన్‌రావు, గోనె దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటక రూపంలో పాఠ్యాంశ బోధన



కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్ హిందీ పండిట్ నాగభూషణం ఆరో తరగతి హిందీ పాఠ్యాంశాన్ని నాటక రూపంలో ప్రదర్శించి మంగళవారం బోధించారు. పాఠ్యాంశంలోని పాత్రలను విద్యార్థులతో చేయించి వినూత్నంగా బోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటక ప్రదర్శనలతో బోధించడం ద్వారా విద్యార్థులు సులువుగా నేర్చుకొని ఎక్కువ కాలం గుర్తుంచుకోగలరని చెప్పారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి



పశువుల షెడ్లను పరిశీలిస్తున్న గంగాభవానీ

కోవూరు: ఉపాధి హామీ పథకం ద్వారా పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని పీడీ గంగాభవానీ కోరారు. మండలంలోని పాటూరు, పోతిరెడ్డిపాలెం పంచాయతీల్లో పశువుల షెడ్లు, పడుగుపాడు పంచాయతీలో సీసీ రోడ్లు తదితర పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. కూలీలకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. మస్టర్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. టీఏ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై దాడి

• కళ్లలో కారం కొట్టి దారుణం

నెల్లూరు(క్రైమ్): కారు బాడుగ అద్దె విషయమై డ్రైవర్ కళ్లలో కారం కొట్టి దాడి చేసిన వ్యక్తులపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని కోనేటిమిట్టకు చెందిన కారు డ్రైవర్ మురళి ఇంటి వద్దకు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్క్ వేసుకొని సోమవారం రాత్రి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో ఆయన లేకపోవడంతో నంబర్‌ను తెలుసుకున్నారు. కావలి వెళ్లేందుకు కారు కావాలని అడగ్గా, తన వద్ద లేదని చెప్పారు. అనంతరం తెలిసిన వారి వద్ద ఆరా తీసి సదరు వ్యక్తులకు మురళి ఫోన్ చేశారు. ఫతేఖాన్‌పేటలో మురళి వద్దకు వచ్చి, బాడుగ తగ్గించాలని మాట్లాడుతూ, అకస్మాత్తుగా కళ్లలో కారం కొట్టి రాయితో దాడి చేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు మంగళవారం నమోదు చేశారు. కాగా ఓ పథకం ప్రకారమే కారు డ్రైవర్‌పై దాడి జరిగిందని భావిస్తున్న పోలీసులు ఆ దిశగా విచారణ జరుపుతున్నారు.

మాలధారణం.. నియమాల తోరణం



అయ్యప్ప పడిపూజలో దీక్షధారులు

• పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ
• ఏటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షధారుల సంఖ్య

కోవూరు: కార్తీక మాసం మొదలుకొని సంక్రాంతి వరకు అయ్యప్పదీక్షల కోలాహలం కనిపిస్తుంది. ఎంతో నిష్ఠతో కఠిన దీక్షలను ఆచరించిన దీక్షధారులు ఇరుముడి ధరించి శబరిమల వాసుడ్ని దర్శించుకుంటారు. ఆరోగ్య సూత్రాల మేళవింపు.. ఆధ్యాత్మిక చింతనతో తమను తాము మార్చుకునేందుకు ఈ దీక్ష ఎంతో దోహదపడుతుంది. దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో శబరిమల అయ్యప్ప దేవస్థానం ఒకటి.

ఆధ్యాత్మికం..

మానవ విలువలను పెంపొందించుకునేందుకు అయ్యప్ప దీక్ష దోహదపడుతుంది. నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం తదితర ఆచారాలు ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై భస్మధారణ ఈశ్వర సంకేతానికి.. నుదిటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తుచేస్తుంది.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం

41 రోజుల దీక్షతో ఆరోగ్యం మెరుగుపడుతుంది. భక్తిభావంతో పాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది ఈ దీక్షలను స్వీకరిస్తారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా.. సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానం నాడీ వ్యవస్థను ఉత్తేజపర్చడం.. నేలమీద పడుకోవడం ద్వారా వెన్నునొప్పుల సమస్యలు తగ్గిపోవడం.. కండరాల పటిష్టత, రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనస్సు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. దీంతో ఏటా అయ్యప్ప దీక్షను వేలాది మంది స్వీకరిస్తుంటారు.

మార్పునకు అవకాశం

అయ్యప్ప దీక్ష నియమాలు ఎంతో కఠినంగా ఉంటాయి. ఆధ్యాత్మిక చింతనతో తమను తాము మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. మాల ధారణ ద్వారా క్రమశిక్షణ వస్తుంది. నిష్ఠతో దీక్ష చేసే వారు ఆదర్శంగా నిలుస్తారు.

– పరశురామ్, పడుగుపాడు

ఎంతో పవిత్రమైంది



అయ్యప్పమాలధారణ ఎంతో పవిత్రమైంది. మనిషిలో మానవత విలువలు పెంపొందుతాయి. మాలను పదేళ్లుగా ధరిస్తున్నా. ఆరోగ్యం, జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. క్రమశిక్షణ అలవాటైంది.

– జయకృష్ణ, కోవూరు

స్నేహభావం పెంపొందుతుంది



అయ్యప్ప మాల ధారణ జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరూ తమ విధిని గుర్తిస్తారు. సంఘజీవిగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఏలా గౌరవించాలో అలవర్చుకుంటారు. పూజలు, భజనల ద్వారా స్నేహ భావం పెంపొందుతుంది.

– ప్రసాద్, కోవూరు

అభివృద్ధి లేదు.. అవినీతి పెరిగిపోయింది



లక్ష్మణరెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• సాగునీరందక రైతుల ఇబ్బందులు
• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిపోయింది. అవినీతి పెరిగిపోయింది. సాగునీటి కాలువల పనులు పూర్తి చేయకుండా దొంగ బిల్లులు పొందేందుకు ప్రయత్నించారు' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిరదవోలు పంచాయతీలో మంగళవారం కాకాణి పర్యటించారు. ఈ సందర్భంగా బిరదవోలులో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. కల్యాణపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు ఎత్తపు లక్ష్మణరెడ్డిని పరామర్శించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ కాలువల్లో నిన్నటి వరకు పనులు చేసి సాగునీరు విడుదల చేశామని చెప్పారని, అయితే రైతుల తిరుగుబాటుతో అవినీతి బట్టబయలైందన్నారు. కొందరు టీడీపీ నాయకులు తమ గ్రామాల్లో ఇంకా కాలువ పనులు ప్రారంభం కాలేదని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ప్రకటనలిచ్చి సెల్ఫ్ గోల్‌కు పాల్పడుతున్నట్టు చెప్పారు. నేతలు కాలువల పనులు చేసినట్టు దొంగ బిల్లులు చేసుకుని స్వాహా చేసేందుకు ప్రయత్నించడంతో రైతులు నిరసన వ్యక్తం చేశారన్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో పనులు చేయలేదని వారే ఒప్పుకొన్నట్టు తెలిపారు. పంటల సాగు ప్రారంభించిన తర్వాత మంజూరైన పనులు చేయకుండా సాగునీటిని విడుదల చేసి దొంగ బిల్లులు చేసుకుని అడ్డంగా దోచుకోవడానికి ప్రయత్నించారన్నారు. ఎట్టకేలకు రైతుల పోరాట ఫలితంగా పనులు చేయకుండా బిల్లులు పెట్టుకునేందుకు ప్రయత్నించినట్టుగా తప్పనిసరి పరిస్థితుల్లో నేతలు ఒప్పుకొన్నట్టుగా అర్థమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. అక్రమ కేసులకు భయపడాల్సిన పనిలేదన్నారు. కాకాణి వెంట నాయకులు వెన్నపూస దయాకర్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, రావుల ఇంద్రసేన్‌గౌడ్, వెన్నపూస కృష్ణారెడ్డి, ఆకుల గంగిరెడ్డి, వెన్నపూస యానాది రెడ్డి, గోపాల్‌నాయుడు, బత్తల పెంచలరెడ్డి, బడుగు శ్రీనివాసులు, బడుగు శ్రీహరి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

ప్రతిభాన్వేషణ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పొదలకూరు: రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలకు మండలంలోని అమ్మవారిపాళెం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. భారతీయ విజ్ఞాన మండలి వారు ప్రతి ఏడాది కౌశల్ సైన్స్ పోటీలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సైన్స్, మ్యాథ్స్, భారతీయ శాస్త్రవేత్తల కృషి అనే అంశాలపై పాఠశాల స్థాయిలో క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. పాఠశాల స్థాయిలో అమ్మవారిపాళెం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అనంతరం జిల్లాస్థాయిలో రాణించిన ఆరుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వారిలో షేక్ షారిన, కె.చాణక్య, ఎస్.కిశోర్, ఆర్.చరిత్, పి.ప్రియాంక, వి.పూజశ్రీ ఉన్నారు. వీరు ఈనెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరిరెడ్డి, సుభాషిణి, వెంకటరెడ్డి, సురేంద్రకుమార్, గౌస్, ఖాజారంతుల్లా, రఘురామయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 885 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 885 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 8,722 మందికి గానూ 885 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

'గీతాంజలి'లో మానవ హక్కుల దినోత్సవం



న్యాయమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్

కోవూరు: మండలంలోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఎన్నెస్సెస్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మానవ హక్కుల సంఘ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ మోరం రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రాథమిక హక్కులపై అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం న్యాయమూర్తి వాణి మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడరాదని, ఎవరైనా ఇలా వ్యవహరిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం న్యాయమూర్తికి జ్ఞాపికను అందజేశారు. ప్రిన్సిపల్ సందీప్‌కుమార్, కళాశాల ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కావలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో గంగవరంలోని గీతాంజలి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. వీరు రూపొందించిన ప్రాజెక్ట్‌కు ప్రథమ స్థానం లభించడంతో పాటు రూ.25 వేలను అందుకున్నారు. దీంతో వీరిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కళాశాల సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, కోశాధికారి విజయశంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి, కళాశాల డైరెక్టర్ సుబ్బారావు, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్ సందీప్‌కుమార్, మహేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కేవలం ఎనిమిది అర్జీలే..



ముత్తుకూరు: మాట్లాడుతున్న సూపరింటెండెంట్



మనుబోలు: తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న రైతు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు సచివాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కేవలం ఎనిమిది అర్జీలు మాత్రమే అధికారుల పరిశీలనకు వచ్చాయి. తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఈ సదస్సులో రెవెన్యూ రికార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులపై అర్జీలు అందాయి. కాగా గ్రామంలో పెద్ద రైతులు మాత్రం ఈ సదస్సులో పాల్గొనలేదు.

➡ **మనుబోలు:** మండలంలోని పిడూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల నుంచి తహసీల్దార్ సుబ్బయ్య అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ నారాయణ, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ **కోవూరు:** రెవెన్యూ సదస్సులు నామమాత్రంగా జరుగుతున్నాయి. సదస్సులకు పది నుంచి 5 మందే హాజరవుతున్నారు. మండలంలోని వేగూరు, కోవూరు సచివాలయ – 2లో నిర్వహించిన సదస్సులకు 20లోపు అర్జీలు అందాయి.

➡ **ఇందుకూరుపేట:** రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కుడితిపాళెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఏడు అర్జీలు అందాయి. మండల సర్వేయర్ హరినాథ్, ఆర్‌ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: కుడితిపాళెంలో..



కోవూరులో..

రక్తదానంపై అపోహలొద్దు



రక్తదానం చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

• వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: రక్తదానంపై ప్రజలకున్న అపోహలను అవగాహన సదస్సుల ద్వారా పోగొట్టాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ – 4, నారాయణ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ రక్తదానం చేస్తే ఎలాంటి ఇబ్బందులు రావనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. ఇంకా మరొకరి ప్రాణాల్ని కాపాడిన వారుగా గుర్తింపు పొందుతారని తెలియజేశారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు రక్తదానం చేయడం మంచిదనే విషయాన్ని అర్థమయ్యేలా వివరించాలని తెలియజేశారు.

ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ – 4 ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉందాం



ఐఆర్‌పీలను సన్మానించిన ఎంపీడీఓ, టీచర్లు

మనుబోలు: అందరం కలిసి దివ్యాంగులకు అండగా ఉందామని ఎంపీడీఓ జలజాక్షి పిలుపునిచ్చారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిత కేంద్రంలో దివ్యాంగులకు తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. బహుమతులిచ్చి ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం ఐఆర్‌పీలు, ఫిజియోథెరపిస్టులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం డేవిడ్, ఐఆర్‌పీలు శ్యామల, షర్మిల, ఫిజియోథెరపిస్ట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

• జెడ్పీ సీఈఓ విద్యారమ



కొడవలూరు: మాట్లాడుతున్న విద్యారమ

కొడవలూరు: ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర లక్ష్యాల సాధనకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ విద్యారమ సూచించారు. అభివృద్ధి.. సుస్థిర లక్ష్యాలపై మండలాధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పేదరిక నిర్మూలన, గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓ అంకయ్య, ఏపీఎం కృష్ణవేణి, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, పద్మావతి, నాగభూషణమ్మ పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** గ్రామాల్లో సుస్థిర పాలనపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ మందిరంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ఎంపీడీఓ డీవీ నరసింహారావు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం చిన్నయ్య తదితరులు వివరించారు.

➡ **ముత్తుకూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ జిల్లా ట్రెయినీ మేనేజర్ శివ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఖర్చులు తగ్గించుకుని, ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ జిల్లా కో – ఆర్డినేటర్ శర్మ, ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీడీఓ నాగమణి పాల్గొన్నారు.



పొదలకూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



వెంకటాచలం: రైతులకు అవగాహన

వెంకటాచలం: వరిసాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయశాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చవటపాళెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగులో నత్రజని ఎక్కువగా వాడకం వల్ల పంటలపై తెగుళ్లు అధికమై, దిగుబడులు తగ్గిపోతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ సందానీ తదితరులు పాల్గొన్నారు.

➡ **తోటపల్లిగూడూరు:** మండలంలోని సౌత్‌ఆములూరు, ముంగళదొరువు రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆత్మ పీడీ శివన్నారాయణ మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, కేవీకే శాస్త్రవేత్తలు లలితా శివజ్యోతి, కిరణకుమార్, వీఏఏలు కుసుమ, కావేరి తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** వరిలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన అవసరమని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొత్తవంగల్లు, యల్లాయపాళెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. భాస్వరం ఎరువులను దుక్కిలో మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో వేస్తే సూక్ష్మ పోషక లోపాలొచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంట నమోదు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు వంశీకృష్ణ, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ **ఇందుకూరుపేట:** నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులను వినియోగించాలని ఆత్మ పీడీ శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేటలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. భాస్వరాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏడీ రాజకుమార్, ఏఓ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: కొత్తవంగల్లులో..



ఇందుకూరుపేట: జగదేవిపేటలో..